## పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 7: బాలికను పెళ్లి చేసుకుంటామని చెప్పి ఆమెను శారీరకంగా వాడుకున్న కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ఎం వీ రమేశ్ తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ బుద్ధే స్వామి తెలిపిన వివరాల ప్రకారం 2019 సంవత్సరంలో రెబ్బెన మండలం గోలేటికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న 17 ఏళ్ల అమ్మాయిని అదే గ్రామానికి చెందిన చునార్కర్ మహేందర్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమె వద్ద నుంచి రూ.5 వేలు, బంగారు ఉంగరం అడిగి తీసుకుని శారీరకంగా వాడుకున్నాడు. ఈ విషయం తల్లికి బాలిక చెప్పింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం పీపీ జగన్మోహన్ రావు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారని సీఐ తెలిపారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ బుద్ధే స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులను ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అభినందించారు.

## నకిలీ విలేకరి అరెస్ట్

లక్షెట్టిపేట, మే 7: మండలంలోని శాంతాపూర్‌కు చెందిన గుర్రాల శశిధర్ రెడ్డి అనే నకిలీ విలేకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ ఐ సురేశ్ తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు విలేకరి అని చెబుతూ సొంత తల్లిదండ్రులను ఆస్తి పంపకం విషయంలో ఇబ్బందులు పెడుతూ దాడి చేసినట్లు తెలిపారు. విలేకరి బాధ్యతల నుంచి తొలగించినప్పటికీ విలేకరినంటూ ప్రజలను బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిందితుడు గుర్రాల శశిధర్‌రెడ్డి అనే నకిలీ విలేకరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బైక్‌ల దొంగల పట్టివేత



పట్టుబడిన దొంగలతో ఏసీపీ ప్రకాశ్

జన్నారం, మే 7 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో బైక్‌ల దొంగలను పట్టుకున్నట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలంలోని మల్లాపూర్‌కి చెందిన బత్తుల పరమేశ్, రెంకల నరేశ్, కొట్టె భానేశ్‌తో పాటు మండలంలోని మురిమడుగుకు చెందిన సంపంగి రమేశ్, కలమడుగుకు చెందిన లావుడ్యా హరికృష్ణ ముఠాగా ఏర్పడి మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, జగిత్యాల జిల్లాలో 12 బైకులను దొంగిలించారని వాటి విలువ రూ.3,60,000 ఉంటుందని తెలిపారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన కంచెర్ల నరేశ్ జన్నారం మండల కేంద్రంలోని హోటల్ వద్ద టీ తాగి వచ్చేసరికి బైక్ లేకపోవడంతో అతను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వాహనాలు తనిఖీ చేస్తుండగా బత్తుల పరమేశ్, రెంకల నరేశ్‌పై అనుమానం రావడంతో వారిని అదుపులో తీసుకొని విచారించారు. గతంలో చేసిన నేరాలను తెలిపారు. వెంటనే వారి వద్ద 12 బైక్‌లను స్వాధీనం చేసుకొని బత్తుల రమేశ్, రెంకల అశోక్, లావుడ్యా హరికృష్ణను అరెస్టు చేయగా సంపంగి రమేశ్, కొట్టె భానేశ్ ఇప్పటికే వేర్వేరు కేసుల్లో జైల్లో ఉన్నట్లు తెలిపారు. ఎంతో చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను ఏసీపీ ప్రకాశ్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ రాజవర్ధన్ అభినందించారు.

## గురునానక్ ఆఫీస్‌ను సీజ్ చేయాలి

నస్పూర్, మే 7 : ఎలాంటి అనుమతులు లేకుండా మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గురునానక్ ఆఫీస్‌పై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం మంచిర్యాల నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ గురునానక్ ఆఫీస్ ఏర్పాటు చేసి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల విద్యార్థుల సమాచారం సేకరించి టెలీకాలర్‌ను పెట్టుకుని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫోన్‌లు చేస్తూ దందా కొనసాగిస్తున్నారన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. వెంటనే ఈ ఆఫీస్‌పై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ సల్మాన్ పాషా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కన్నెపల్లి, మే 7 : మండలంలోని నాయకునిపేట, మెట్‌పల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మిమోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయ, రోహిత్, సాయి, హంసహన్మంతు, సాయిని రంగారావు, గిరిజచంద్రయ్య, సుధాకర్, వెంకటేశ్, శ్రీనివాస్, భాస్కర్ తదితరులున్నారు.

## గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

బెల్లంపల్లి, మే 7: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఎంపీడీవో మహేందర్‌కు ఆ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. మండలంలో 17 గ్రామపంచాయతీల్లో కొందరు నాయకులు తమ ఇష్టారాజ్యంగా తమ అనుచరులు, అర్హత లేనివారికి లబ్ధిదారులుగా చేర్చారని ఆరోపించారు. గ్రామపంచాయతీల కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై సంబంధిత జాబితాను అంటించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మేకల రాజేశం, సీపీఐ మండల సహాయ కార్యదర్శి గోమాస గంగారం ఉన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సీసీసీ, నస్పూర్ 7 : ప్రైవేటీకరణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, హమాలీలకు వెల్ఫేర్ బోర్డు సాధనకై ఈ నెల 20న జరిగే టోకెన్ సమ్మెలో పాల్గొని పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాశ్ పిలుపునిచ్చారు. బుధవారం నస్పూర్‌లోని రైస్ మిల్ కార్మికులతో కలిసి 20న టోకెన్ సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. 50 సంవత్సరాలు పైబడిన హమాలీలకు నెలకు రూ.9 వేల పింఛన్ ఇవ్వాలని, అసంఘటిత కార్మికులందరికీ సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని, హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పింఛన్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్ని రంగాల హమాలీ కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ నాయకులు సురేందర్, మొగిలి, రామ్ చందర్, నాగన్న, శేఖర్, నగేశ్, కొమురయ్య, శంకర్, సతీశ్, చంద్రయ్య, అంజి ,లింగయ్య, గోపాల్, సంపత్, మిడివెల్లి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## నీలగిరి వనాలతో లాభాలు

నెన్నెల, మే 7 : నీలగిరి వనాలతో ఎన్నో లాభాలు ఉన్నాయని వీటిపై అవగాహన పెంచుకోవాలని టీజీఎఫ్‌డీసీ కాగజ్‌నగర్ డివిజన్ మేనేజర్ శ్రీవాణి అన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సావాలను పురస్కరించుకొని నీలగిరితో నా స్నేహం పేరిట బుధవారం నెన్నెల సమీపంలోని బొప్పారంలో నీలగిరి తోటల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, బెల్లంపల్లి రేంజ్ మేనేజర్ సునీత, మేనేజర్ దుర్గం నరేశ్, రైతులు పాల్గొన్నారు.

## కన్నయ్య కుటుంబానికి పరామర్శ



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న జిల్లా గిరిజన శాఖ అధికారి జనార్దన్

వేమనపల్లి, మే 7 : యజమాని వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న నాయిని కన్నయ్య కుటుంబాన్ని బుధవారం జిల్లా గిరిజన శాఖ అధికారి జనార్దన్ పరామర్శించారు. కన్నయ్య భార్య నాయిని స్వరూప, తల్లి ఎల్లక్కను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కన్నయ్య ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కన్నయ్య కుటుంబానికి చెందిన భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న ఎనగంటి హరీశ్‌పై చర్యలు తీసుకుని పట్టాను రద్దు చేసి తిరిగి కన్నయ్య కుటుంబానికి పట్టా చేసి ఇస్తామని, కొడుకు అఖిల్ చదువు కోసం బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో జాయిన్‌చేస్తామని గిరిజన శాఖ అధికారి హామీఇచ్చారు. అనంతరం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నంలు జిల్లా గిరిజన శాఖ అధికారికి వినతి పత్రం అందించారు. కన్నయ్య కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కన్నయ్య మృతికి కారణమైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన అధికారి అశోక్, నాయిని ఎల్లక్క, స్వరూప, పోశం, లచ్చన్న, మొండి పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రతావారోత్సవాలు

చెన్నూర్ రూరల్, మే 7: విద్యుత్ భద్రతావారోత్సవాల కార్యక్రమంలో భాగంగా చెన్నూర్‌లో ఎస్ఈ వీ గంగాధర్ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రతా వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చెన్నూర్‌లోని ఎంఆర్ఆర్ ఫంక్షన్ హాల్ చెన్నూర్ డివిజన్ స్థాయి సిబ్బంది కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విధుల్లో విద్యుత్ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, వినియోగదారుల కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందికి పనిచేసే సమయంలో ఉపయేగించే విద్యుత్ కిట్లను అందజేశారు. విద్యుత్ భద్రతావారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ ఖైజర్, ఏడీఈ బాలకృష్ణ, చెన్నూర్, కొమ్మెర, కోటపల్లి, భీమారం, జైపూర్ ఏఈలు కేశెట్టి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శంకర్, మనోహర్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

కోటపల్లి, మే 7: క్షయవ్యాధి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోటపల్లి వైద్యురాలు అరుణశ్రీ అన్నారు. కోటపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీ నిర్ధారణ ఏసీఎఫ్ వాహన క్యాంపు శిబిరాన్ని ప్రారంభించారు. ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే ఆరోగ్య కార్యకర్త దవాఖాన సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే సులువుగా వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. పలువురికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ అశోక్ సాయిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల (ఏసీసీ), మే 7: జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంస్థాగత మద్దతు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రవికిరణ్ బుధవారం తెలిపారు. ప్రపంచబ్యాంకు మద్దతుతో ఎంఎస్ఎంఈ కింద ప్రభుత్వం అన్ని జిల్లాల్లో జిల్లా పరిశ్రమల కేంద్రాల్లో ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నదని, తద్వారా మార్కెట్ యాక్సిస్, క్రెడిట్ లభ్యత, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు అవసరమైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అర్హత, అనుభవం గల వ్యక్తుల నుంచి ఒక మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ తను ప్రతి జిల్లాకూ నియమించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, మేనేజ్‌మెంట్ కామర్స్, ఇంజినీరింగ్ నేపథ్యంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సంబంధిత వెబ్‌సైట్, కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## కౌలు రైతు ఆత్మహత్యాయత్నం



దవాఖానలో చికిత్స పొందుతున్న బక్కయ్య

నెన్నెల, మే 7 : పంట చేతికి రాదేమోనన్న బెంగతో ఓ కౌలు రైతు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారంలో జరిగింది. గంగారం గ్రామానికి చెందిన కడారి బక్కయ్య మూడెకరాలు కౌలు తీసుకొని వరి సాగు చేశాడు. ఇంకొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో గాలివాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కోయడానికి కూడా వీలు లేకుండా పడిపోయి వడ్లు మొత్తం రాలిపోయాయి. పంట నష్టపోయినట్లు ఫొటో దిగి సాయమందించాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. పంట కోసం తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతుందని, ఆయన పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

## క్రీడా కిట్‌లు పంపిణీ

నస్పూర్, మే 7 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అందించిన క్రీడా కిట్‌లను బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాక్రీడ యువజన సేవల అధికారి రాజ్ వీరుతో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ రాజేశ్, ఫుట్‌బాల్, వాలీబాల్, కరాటే శిక్షకులు వనిత, పున్నంచందు, రవి పాల్గొన్నారు.

# ఇండ్ల జాబితాలో అనర్హులుంటే కఠిన చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్, మే 7: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు చేర్చినట్లయితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గంగిపెల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేయాలన్నారు. 600 చదరపు గజాల్లో ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలో అర్హత కలిగిన వారి జాబితా రూపొందించాలని అధికారులకు సూచించారు. పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ, ఎంపీవో బాపురావు, గ్రామకార్యదర్శి సత్యనారాయణ తదితరులున్నారు.



ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

**చదువుతోనే ఉన్నత స్థాయికి చేరే అవకాశం**

కాసిపేట, మే 7 : ప్రతి ఒక్కరికీ చదువు చాలా ముఖ్యమని, పూర్తి విజ్ఞానాన్ని సంపాదించుకుని జీవితంలో ఉన్నత స్థాయిలో నిలిచేందుకు విద్య దోహదపడి గౌరవం లభిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం రాత్రి కాసిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, మండల తహసీల్దార్ భోజన్నలతో కలిసి హాజరయ్యారు. విద్యతో పాటు వృత్తి శిక్షణలో నైపుణ్యత పొందాలని అన్నారు. మండలంలోని గ్రామపంచాయతీలకు 2 కుట్టు మిషన్ల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తూ అవకాశం కల్పిస్తామని తెలిపారు. అటవీ భూములు, పోడు భూములలో వెదురు సాగుకు నిబంధనల ప్రకారం అవకాశం ఉంటుందని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శేఖ్ సఫ్దర్ అలీ, డీఆర్పీ బండ శాంకరి, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

పెంచికల్ పేట్, మే 7 : భూభారతి నూతన చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం పెంచికల్ పేట్ మండలంలోని దరోగపల్లి, చేడువాయిలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అధికారులు తీసుకుంటున్న దరఖాస్తులను పరిశీలించి తగు సూచనలను అందించారు. ఈ సదస్సుల ద్వారా రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఎల్కపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలను అందించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

అనంతరం లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరా శాఖ అధికారి వినోద్ స్వామి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ , కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆల్బర్ట్, ఏపీఎం కోనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

**తాగునీటి సమస్య పరిష్కరించాలి**

కాగజ్‌నగర్, మే 7: జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేతిపంపులు, బోరు మోటార్లు పని చేయకపోతే మరమ్మతులు చేయించాలన్నారు. మిషన్ భగీరథ పైపు లైన్ల లీకేజీ అరికట్టాలన్నారు. నీటి ఎద్ద నివారణకు నీటి ట్యాంకర్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లుంటే సంబంధిత కార్యదర్శి, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సిద్ధిఖి, ఎంపీడీవో ప్రసాద్, మండల పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

# అర్హులకే రుణాలు అందిస్తాం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

జైనూర్ మే 7: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన అభ్యర్థులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. నిరుద్యోగ యువతతో మాట్లాడి వారి ఆకాంక్షలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని మాన్కుగూడ గ్రామ పంచాయతీలో తాగు నీటి వనరులు, ఈజీఎస్ పనులను పరిశీలించి నీటి వనరుల పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధి హామీ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు వాటర్ రీఛార్జ్, హార్వెస్టింగ్ నిర్మాణాలను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, డీపీవో, డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి తిరుమల్లేశ్, ఈజీఎస్ ఏపీవో నగేశ్, ఎంపీవో మోహన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు న్నారు.

## సింగరేణిలో అవినీతి నిర్మూలనకు సహకరించాలి

శ్రీరాంపూర్, మే 7: సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. వివిధ పనులు చేయిస్తామని పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి వివరాలు, ఆధారాలు ఇచ్చిన వారికి రూ.10 వేల పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు తెలిపింది. కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నెంబర్ 9491144104 కు గాని విజిలెన్స్ శాఖ మెయిల్ ఐడి vig@scclmines.comకు సమాచారం ఇవ్వాలని సూచించింది.

## కార్మికుడి కుటుంబానికి సాయం

శ్రీరాంపూర్, మే 7 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేసి కేన్సర్ వ్యాధితో మృతి చెందిన కల్వల సంపత్ కుటుంబానికి కార్మికులు, అధికారులు విరాళాలు సేకరించి రూ.1,02500 కుటుంబ సభ్యులకు అందజేశారు. బుధవారం గనిపై మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ సంఘం సదానందం మృతుడి భార్య లతకు అందజేశారు. తోటి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవడంపై గని మేనేజర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, ఈఈ శ్యాంసుందర్, సీనియర్ పీవో సురేందర్, టీబీజీకేఎస్ కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు గొర్రె నర్సయ్య, రాంచందర్, నగేశ్, సురేశ్, కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరం తనిఖీ

కాసిపేట, మే 7 : కాసిపేట మండలంలోని లంబాడీతండా(ఎస్) ప్రైమరీ పాఠశాలలో సోమగూడెం(కే), లంబాడీతండా(కే) గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని డీఈవో ఎస్ యాదయ్య తనిఖీ చేశారు. నేర్చుకున్న విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.శిక్షణ తరగతులపై వలంటీర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు రజిత, తదితరులు పాల్గొన్నారు.

## నీలగిరి వనాలతో లాభాలు

నెన్నెల, మే 7 : నీలగిరి వనాలతో ఎన్నో లాభాలు ఉన్నాయని వీటిపై అవగాహన పెంచుకోవాలని టీజీఎఫ్‌డీసీ కాగజ్‌నగర్ డివిజన్ మేనేజర్ శ్రీవాణి అన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సావాలను పురస్కరించుకొని నీలగిరితో నా స్నేహం పేరిట బుధవారం నెన్నెల సమీపంలోని బొప్పారంలో నీలగిరి తోటల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, బెల్లంపల్లి రేంజ్ మేనేజర్ సునీత, మేనేజర్ దుర్గం నరేశ్, రైతులు పాల్గొన్నారు.

## కమిటీల పేరుతో కాంగ్రెస్ సర్కారు కాలయాపన



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా నాయకులు

కౌటాల, మే 7 : ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, నరసింహచారిలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, కరువు భత్యం, ఉద్యోగోన్నతులు, సర్వీసుల సమస్యల పరిష్కారం ఏ మాత్రం కావడం లేదన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు వెంటనే పూర్తి చేయాలని కుమ్రం భీం జిల్లా తరపున వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాలోని జడ్పీ పాఠశాలల్లో కౌటాల పాఠశాల నుంచి పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కోమటిపల్లి సాయి కృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎంఎల్ రాజు, గణపతి, శ్రావణ్, సాంబశివరావు, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, అనిల్, పండరినాథ్, సంపత్, దేవాజీ తదితరులున్నారు.

# ధ్వంసమైన మురుగు కాలువ నిర్మాణం

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన



ధ్వంసమైన కాలువను నిర్మాణం చేయించిన కార్యదర్శి మేఘన

కాసిపేట, మే 7 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన మురుగు కాలువను ధ్వంసం చేసిన ఘటనపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మే 4వ తేదీ ఆదివారం వచ్చిన 'మురుగు కాలువ ధ్వంసం' అనే కథనంపై ముత్యంపల్లి కార్యదర్శి మేఘన స్పందించారు. ముత్యంపల్లి హనుమాన్ టెంపుల్ నుంచి గ్రామాన్ని కలుపుతూ వాగు వరకు మురుగు కాలువ ప్రభుత్వం నిధులతో నిర్మించారు. ఇటీవల ఆ కాలువను ఇంటి నిర్మాణానికి ధ్వంసం చేశారు. ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ' వచ్చిన కథనంపై కార్యదర్శి మేఘన స్పందించారు. కాలువను పునఃనిర్మాణం చేయించి సమస్యను పరిష్కరించారు.

## జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నాయకులు

మందమర్రి, మే 7: సీనియర్ సౌత్‌జోన్ జాతీయ స్థాయి హ్యాండ్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. గత నెల 30న మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన 40వ హెచ్‌ఎఫ్ఐ సౌత్‌జోన్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలలో జిల్లా తరుపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో శివాని(పెంచికల్‌పేట), ఆత్రం ధన లక్ష్మి(మార్లవాయి), ప్రవీణ్(బెజ్జూర్) ఉన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బుధవారం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ రెడ్డి, డీడీటీడబ్ల్యూ ఆసిఫాబాద్ రమాదేవి, కోచ్‌లు అరవింద్, కళ్యాణ్, శేఖర్, రాకేశ్, సాయిలు అభినందించారు. ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని ఆరని తిరవన్నమలై పట్టణంలో జరిగే 40వ జాతీయ స్థాయి సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలలో ఈ క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## అనర్హులకే ఇండ్లు ఇస్తున్నరు

- ఎంపీడీవోకు సిద్ధాపూర్ గ్రామస్తుల వినతి



ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బెజ్జూర్, మే 7 : మండలంలోని పెద్ద సిద్ధాపూర్ గ్రామ పంచాయతీల్లో అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లను కమిటీ సభ్యులు కేటాయిస్తున్నారని పెద్ద సిద్ధాపూర్ గ్రామస్తులు అన్నారు. అర్హులకే ఇవ్వాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీ సభ్యులు వారు గ్రామ సభలు పెట్టకుండానే వారి ఇష్టారాజ్యంగా అనర్హులకే ఇండ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. పూరి గుడిసెలు ఉన్న వారి పేర్లు జాబితాలో ఉండడం లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారికే మళ్లీ ఇల్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపేదలకే ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కావుడె తారాబాయి, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు అర్హులనే ఎంపిక చేయాలి

కెరమెరి, మే 7: ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికలో అర్హులనే ఎంపిక చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకట్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈజీఎస్, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అఙ్జద్‌పాషా, ఏవో యుగంధర్, ఏఈ విశ్వేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులున్నారు.

## అందుగూడ లో కార్డెన్ సెర్చ్

జైనూర్, మే 7 : జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగూడలో జైనూర్ సీఐ రమేశ్ బుధవారం కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలు, వాహన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై, అక్రమ మద్యంపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నిబంధనలు, హెల్మెట్, లైసెన్స్, సైబర్ మోసాలు, తదితర అంశాలపై సూచనలు చేశారు. 60 ఇండ్లలో తనిఖీలు నిర్వహించి 8 లీటర్ల అక్రమ మద్యం 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసంచేశారు.ఈ కార్యక్రమంలో జైనూర్, లింగాపూర్, కెరమెరి, మండలాల ఎస్ఐలు జీ రవికుమార్, అనిల్ కుమార్, ఎస్ఐ మధుకర్, సివిల్ పోలీస్‌లు టీజీఎస్పీ బృందంతో కలిసి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూనిఫామ్‌లను సిద్ధం చేయాలి

జైనూర్,మే 7: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ దుస్తులను త్వరగా కుట్టాలని సీఎంవో మధుకర్ కోరారు. జైనూర్ మండలంలోని స్వయం సహాయ సంఘాల ద్వారా నడుపుతున్న యూనిఫామ్ కుట్టు కేంద్రాలను బుధవారం సీఎంవో కటకం మధుకర్ పరిశీలించారు. మండలంలోని 72 పాఠశాలల విద్యార్థులకు జూన్ 12 వరకు తప్పనిసరిగా ఒక జత యూనిఫామ్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ ఎమ్మార్సీ ఏంఐఎస్ పవార్ తుకారాం, సీఆర్పీలు గంగు, రవీందర్, జాదవ్ తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం పరిశీలన

రెబ్బెన, మే 7: రెబ్బెన మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ సందర్శించి పరిశీలించి పలు సలహాలు సూచనలు చేశారు. వర్షాలు పడుతున్నందున్న వరి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, తేమ శాతం పరిశీలించాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన వరి ధాన్యం వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్ రావు, ఐకేపీ ఏపీఎం వెంకటరమణశర్మ సిబ్బంది ఉన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 7: మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఇన్‌చార్జి స్వప్న అన్నారు. బుధవారం మండలంలోని బూరుగూడలో ఉపాధి హామీ సిబ్బందికి మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు పోలీస్ పెద్దపీట వేస్తామని, ఎలాంటి ఇబ్బందులు కలిగినప్పుడు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహాయం కోసం డయల్ 100, షీ టీమ్ 8712670564లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రజిని, శ్రీలత, స్వప్న, దినేశ్ తదితరులున్నారు.

## ఆయిల్ పామ్‌తో రైతులకు అధిక లాభం

కాగజ్‌నగర్, మే 7: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి ఎండీ అబ్దుల్ నదీం అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని దుర్గానగర్‌లో బుధవారం రైతులకు ఆయిల్ పామ్‌తో పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. పంట నాలుగేళ్ల తర్వాత చేతికి వస్తుందని, నిర్వహణకు ప్రతి సంవత్సరం ఉద్యాన శాఖ తరపున రూ.4200 అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించే ధరతో కంపెనీ గెలలు కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఉద్యాన శాఖ అధికారి సెల్ 8977713965, 8328166376లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డివిజన్ అధికారి సుప్రజా, ఏఈవో శైలేశ్, మ్యాట్రిక్స్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం కోసం భవనం పరిశీలన

కౌటాల, మే 7 : మండల కేంద్రంలోని గంథాలయం శిథిలావస్థలో ఉండడంతో నూతన భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చేందుకు పాత ఐకేపీ కార్యాలయ భవనాన్ని ఎంపీడీవో బుద్ధే రమేశ్ బుధవారం పరిశీలించారు. అనంతరం విర్దండి, బాలెపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ వికాస్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లు, తాగు నీటి సరఫరాపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీవో పూర్ణిమ, ఈసీ సంతోష్, పంచాయతి కార్యదర్శులు, తదితరులున్నారు..

## రోగులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలి

కాగజ్‌నగర్, మే 7: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారాన్ని అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, కాగజ్‌నగర్ పట్టణంలోని ఏరియా దవాఖానలను సందర్శించి రోగులకు అందిస్తున్న ఆహారం మెనూ, ఆహారాన్ని పరిశీలించారు. వంటశాలను సందర్శించి రోగులకు అందించే ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసరాలు వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినోద్, వాసుదేవ్, అధికారులు ప్రశాంత్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.